హైడ్రోజన్ పరిశోధనలకు గుర్తింపు

సిటీబ్యూరో, జూలై 27(నమస్తే తెలంగాణ): హైడ్రోజన్ పరిణామాలపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ చేస్తున్న పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుంది. హైడ్రోజన్ కంపొనెంట్లపై చేస్తున్న అధ్యయనాలను విస్తృతం చేయగా.. ఇటీవల కాలంలో క్లీన్ ఎనర్జీ తయారీలో ఐఐసీటీ కీలక పాత్రను పోషిస్తున్నది. ఈ క్రమంలో ఐఐసీటీకి చెందిన డా.ఉజ్వల్ పాల్ బృందం చేసిన ఎఫిషియంట్ ఫొటోక్యాటలిటిక్ హైడ్రోజన్ ఎవల్యూషన్ పరిశోధన కథనాన్ని అంతర్జాతీయ కెమికల్ జర్నల్ అయిన ఏసీఎస్ అప్లయిడ్ మెటీరియల్ అండ్ ఇంటర్‌ఫేస్‌లో ప్రచురించారు. తమ పరిశోధనలకు దక్కిన అరుదైన గుర్తింపుపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

బ్రెయిన్‌డెడ్.. అవయవ దానం

ముగ్గురి జీవితాల్లో వెలుగులు

మన్సూరాబాద్/ ఖైరతాబాద్, జూలై 27: పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మరి కొందరికి ప్రాణం పోసేందుకు ఓ కుటుంబం ముందుకు వచ్చింది. బ్రెయిన్‌డెడ్ అయిన తమ కుటుంబ సభ్యుడి అవయవాలను దానం చేసి మరి కొందరికి ప్రాణం పోశారు. సికింద్రాబాద్, బృందావన్‌నగర్, భూదేవినగర్‌కు చెందిన అద్దంకి రాజ(24) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. ఈ నెల 19 న సాయంత్రం 6 గంటలకు బైకుపై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. గాయపడిన రాజాను చికిత్స నిమిత్తం ఎల్బీనగర్‌లోని కామినేనికి తరలించారు. ఐసీయూలో ఎనిమిది రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ అతడి ఆరోగ్యం కుదుటపడలేదు. రాజను ఈ నెల 26న బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు ప్రకటించారు. విషయం జీవన్ దాన్ సంస్థ ప్రతినిధులకు తెలియడంతో రాజా కుటుంబ సభ్యులకు అవయవదానంపై వారు అవగాహన కల్పించారు. దీంతో బ్రెయిన్‌డెడ్ అయిన రాజా అవయవాలను దానం చేసేందుకు బాధిత కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు.

అంతర్జాతీయ వైద్యం..!

గుండె సంబంధిత వ్యాధులకు క్యాత్ ల్యాబ్, అంజియో, ఏకో, ట్రెడ్ మిల్, బైపాస్ సర్జరీ ద్వారా అధునాతన చికిత్సలు అందిస్తున్నారు. యూరాలజీ, నెఫ్రాలజీ విభాగంలో కిడ్నీ సంబంధించిన వ్యాధులకు డయాలసిస్ లేజర్, ల్యాప్రోస్కోపిక్ ద్వారా సేవలందిస్తున్నారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో మెదడు, వెన్నుపూస వ్యాధులకు ఎంఆర్ఐ, సీటీ, ఈఈజీ, ఈఎంజీ, ఆధునాతన మైక్రోస్కోప్ ద్వారా వైద్య సేవలందిస్తున్నారు. అదే విధంగా గ్యాస్ట్రో, లివర్‌కు సంబంధించిన వ్యాధులకు ఎండోస్కోపీ, శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. అలాగే, స్పెషాలిటీ విభాగాలలో జనరల్ సర్జరీలో ల్యాప్రోస్కోపిక్, ప్లాస్టిక్, కాస్మెటిక్ సర్జరీ, మాతా శిశువు సేవలలో భాగంగా నార్మల్, సిజేరియన్ డెలివరీలు, ఇన్ఫెర్టిలిటీ, క్యాన్సర్ స్క్రీనింగ్, ఫ్యామిలీ ప్లానింగ్ సేవలు అందించబడుతున్నాయి. అంతే కాకుండా కళ్లు, ముక్కు, చెవి, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స అందిస్తున్నారు. 24 గంటలు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు.

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత

మా ఇనిస్టిట్యూట్‌లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తాం. క్రీడాకారులను ప్రోత్సహిస్తాం. స్టేట్, నేషనల్ స్థాయిలో ఏదైనా క్రీడలో ప్రావీణ్యం ఉన్న విద్యార్థులు మా కళాశాలలో ఉచితంగా చదువుకోవచ్చు. ఇక్కడ వారికి నిపుణులైన కోచ్‌లు సైతం అందుబాటులో ఉంటారు. వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తాం. అవసరమైతే వారి ప్రతిభకు తగ్గట్టు క్రీడల్లో రాణించేందుకు సహకారం కూడా అందిస్తాం. క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలనే లక్ష్యంతోనే మా క్యాంపస్‌లో అత్యాధునిక హంగులతో క్రికెట్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ స్టేడియంలు ఏర్పాటు చేశాం.

– మర్రి లక్ష్మణ్ రెడ్డి, చైర్మన్, ఎంఎల్ఆర్ఐటీ.

పేషెంట్ల కండ్లల్లో ఆనందం సంతృప్తినిస్తుంది

అమ్మకు ఇచ్చిన మాట కోసం అత్యాధునిక ఆసుపత్రిని ఏర్పాటు చేశాం. 24 గంటలు పూర్తిగా ఉచితంగా సేవలందిస్తున్నాం. ఇక్కడ చికిత్స తీసుకుని ఆరోగ్యంగా ఇంటికెళ్లే వాళ్ల కండ్లలో ఆనందం చూసినప్పుడు అది మాకెంతో సంతృప్తినిస్తుంది. లక్షల రూపాయల విలువజేసే అనేక శస్త్ర చికిత్సలు అన్నీ పూర్తిగా, ఉచితంగా అందిస్తున్నాం. నాన్నకు ప్రేమతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు అండగా నిలుస్తున్నాం. క్రీడలకు అధిక ప్రాధాన్యత నిస్తూ అత్యాధునిక క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాం.

– మర్రి రాజశేఖర్ రెడ్డి, సెక్రటరి ఫౌండర్, ఎంఎల్ఆర్ఐటీ, అరుంధతి ఆసుపత్రి.

అమ్మ కోరిక మేరకు.. ఉచితం..కార్పొరేట్ వైద్యం

- అమ్మానాన్నల లక్ష్యం నెరవేర్చి.. జనం గుండెల్లో నిలిచి..!
- సామాజిక సేవతో ఆదర్శంగా నిలిచిన మర్రి రాజశేఖర్ రెడ్డి
- అరుంధతి ఆసుపత్రితో అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా..
- క్రీడాకారులకు ప్రోత్సాహమిస్తూ ప్రతి ఏటా 35 మందికి ఉచిత విద్య
- ప్రపంచ స్థాయి హంగులతో క్యాంపస్‌లో క్రీడా ప్రాంగణాలు
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా విద్య, వైద్య సేవలు
- దుండిగల్‌లోని ఎంఎల్ ఆర్ఐటీకి విశేష ఆదరణ

అమ్మానాన్నల లక్ష్యం నెరవేర్చడమనేది ఏ కొడుకుకైనా గొప్ప సంతోషాన్నిస్తుంది. అందులోనూ ఆ లక్ష్యం సామాజిక సేవే.. అయితే, అది జనమందరి సంబురంగా మారుతుంది. తల్లిదండ్రులకు గొప్ప సంతృప్తినిచ్చే విధంగా సేవలందిస్తున్న ఆ కొడుకు పేరు మర్రి రాజశేఖర్ రెడ్డి. ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫౌండర్ సెక్రటరి. ఈ పేరు వినగానే అందరికి గుర్తొచ్చేది అరుంధతి ఆసుపత్రి. అరుంధతి పేరు చెప్పగానే అందరి నోళ్లల్లో నానేది 'బిల్లు లేని ఆసుపత్రి'. ఇంతటితో ఆ సేవ ఆగలేదు. తండ్రి హృదయంలో ఉన్న క్రీడా స్థానాన్ని ఎరిగి ప్రతిష్టాత్మకమైన ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో ఖరీదైన చదువును ప్రతి ఏటా 35 సీట్లు ఉచితంగా విద్యార్థులకు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సమాజంలో విద్య, వైద్యం అత్యంత ఖరీదుగా మారిన ఈ రోజుల్లో సాధ్యమైనంత ఉచితంగా అందిస్తూ మేమున్నామంటూ భరోసానిస్తున్న ఆ మర్రి కుటుంబ సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నగర శివారులోని దుండిగల్‌లో ఉన్న మర్రి లక్ష్మణ్ రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ దేశ వ్యాప్తంగా ఎందరి మనసుల్లోనే స్థానం దక్కించుకుంది. విద్య, వైద్యాన్ని వ్యాపారం కోణంలోనే చూసే ఈ రోజుల్లో నిరుపేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సాగుతున్న ఆ మర్రి కుటుంబంపై నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం... – సిటీబ్యూరో, జూలై 27(నమస్తే తెలంగాణ):

నాన్నపై గౌరవంతో..!

మర్రి రాజశేఖర్ రెడ్డి. ప్రస్తుత మల్కాజిగిరి ఎమ్మెల్యే. అతడి తల్లిదండ్రులు మర్రి లక్ష్మణ్ రెడ్డి, అరుంధతి. తండ్రి లక్ష్మణ్ రెడ్డి ఎంఎల్ఆర్ఐటీ చైర్మన్. అతడికి క్రీడలపై అమితాసక్తి. స్వతహాగా స్పోర్ట్స్‌మ్యాన్. సైక్లింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో ప్రావీణ్యుడు. అనేక మెడల్స్, బహుమానాలు పొందారు. పచ్చదనంతో కూడిన క్రికెట్ స్టేడియం, ఫుట్‌బాల్ గ్రౌండ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర గ్రౌండ్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేశారు. ఎంఎల్ఆర్ఐటీ సుమారు 40 ఎకరాల్లో సంస్థ విస్తరించి ఉంది. 2007లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థాపించారు. అప్పట్నుంచి ప్రతి ఏడాది 35 మంది విద్యార్థులకు.. ఇప్పటి వరకు 595 మందికి ఉచితంగా విద్యనందించింది. భారత బాక్సర్ నిఖత్ జరీన్ సైతం ఈ కళాశాల ఎంబీఏ విద్యార్థి కావడం విశేషం. చదువు అంటే విజ్ఞానం, ఆట, పాట, మానసిక ఉల్లాసం, ఆరోగ్యమే కదా.. అని విశ్వసించి అందుకు తగ్గట్టు విభిన్న రకాల క్రీడా స్థలాలను ఏర్పాటు చేశారు. యోగా, జిమ్‌లు కూడా అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకున్నాయి. శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే మానసికంగా సంతోషంగా ఉంటామనేది లక్ష్మణ్ రెడ్డి నమ్ముతారు. అంతేకాదు లక్ష్మణ్ రెడ్డి పర్యావరణ ప్రేమికుడు. కాలుష్యాన్ని తగ్గించడానికి సైక్లింగ్‌ను ప్రోత్సహించాలనేది ఆయన అభిమతం. అందుకే కాలేజీలో విద్యార్థులు, సిబ్బంది సైకిల్ కొనుగోలు చేయాలనుకుంటే అందులో సగం ధర లక్ష్మణ్ రెడ్డినే చెల్లిస్తుంటారు. అనేక టోర్నమెంట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి విద్యార్థులు అనేక మంది వివిధ క్రీడల్లో గెలుపొంది బహుమతులు తీసుకొచ్చారు. ఆ బహుమతులన్నీ గది నిండా నిండిపోవడం విశేషం. నిపుణులైన కోచ్‌లు అందుబాటులో ఉంటారు. అంతేకాదు ఎంఎల్ఆర్ఐటీతో మాజీ భారత కోచ్ భాస్కర్ బాబు సమన్వయంతో బ్యాడ్మింటన్ అకాడమీ సైతం ఇందులో కొనసాగుతుండటం మరో విశేషం. ఈ సంస్థ ఇటీవల జూనియర్ నేషనల్ ఫెన్సింగ్, సౌత్ జోన్ రిలయన్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించింది. దీంతో పాటు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లో ఈ కాలేజీకి ఖేలో ఇండియా గుర్తింపు సైతం దక్కింది. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రెసిడెంట్‌గా సైతం మర్రి రాజశేఖర్ రెడ్డి ఉండటం మరో విశేషం.

అమ్మకు ప్రేమతో..!

ఆసుపత్రి నిర్మించి అమ్మ పేరు పెట్టాలని మర్రి రాజశేఖర్ రెడ్డి భావించారు. ఈ విషయాన్ని తల్లికి వివరించారు. ఆమె చాలా సంతోషించింది. అయితే, ఆమె తన కొడుకుతో ఇలా ''ఆసుపత్రి నిర్మించడం మంచి ఆలోచన. అయితే, అందులో అందించే ఏ సేవనైనా ఉచితంగా ఉంటేనే నా పేరు పెట్టు. అందరిలా ఆసుపత్రి ఏర్పాటు చేద్దామనుకుంటే మాత్రం నా పేరు పెట్టొద్దు.'' అని చెప్పింది. దీంతో కొడుకు మరో మాట మాట్లాడకుండా 'ఉచితంగా సేవలందించేందుకే ఈ ఆసుపత్రి నిర్మిస్తానమ్మ' అంటూ మాటిచ్చారు. అదే స్ఫూర్తితో 2019లో అరుంధతి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి రోజు 12 వందల మంది ఔట్ పేషెంట్లను పరీక్షిస్తుంది. ప్రపంచ స్థాయి వైద్య సేవలన్ని ఇక్కడ ఉచితంగా అందించడం గొప్ప విషయం. వేలాదిగా ధరలు ఉండే సీటీ, ఎంఆర్ఐ, ఆల్ట్రా సౌండ్ పరీక్షలన్నీ ఉచితంగా లభ్యమవుతున్నాయి. ప్రతి రోజు 20-30 సర్జరీలు చేస్తుంటారు. ఈ లెక్కన ఇప్పటి వరకు 43,720 సర్జరీలు జరిగాయని వైద్యులు తెలిపారు. ఇన్ని సర్జరీలు పూర్తిగా ఉచితంగా అందించడం అరుంధతి ఆసుపత్రికే సాధ్యమైందని పలువురు ప్రశంసిస్తున్నారు. పేదలు ఒక్క పైసా ఖర్చు లేకుండా లక్షల్లో లభించే వైద్యాన్ని పొందుతున్నారు. దేశంలో ఇలాంటి సేవలందిస్తున్న ఆసుపత్రి మరెక్కడా లేదనడంలో అతిశయోక్తి లేదు. ఈ ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్) గుర్తింపు సైతం ఉంది.

స్మిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య.

లేని పక్షంలో ఉద్యమిస్తాం: ఆర్.కృష్ణయ్య

చిక్కడపల్లి, జూలై 27: ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ గర్వంతో చేసిన వ్యాఖ్యలు సర్వీస్ రూల్స్ వ్యతిరేకంగా ఉన్నాయని బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మిత సబర్వాల్ దివ్యాంగుల రిజర్వేషన్ వ్యతిరేకిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను వ్యతిరేకించడం అవుతుందన్నారు. ఉన్నత పోస్టులో ఉండి ఈ విధంగా మాట్లాడటం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు, సమాస్త సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. వెంటనే స్మిత సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలని లేని పక్షంలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి: వెన్నెల గద్దర్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవ్వాలిన అసవరం అందరిపై ఉందని ప్రజా యుద్ధ నౌక గద్దర్ కుమార్తె, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వెన్నెల గద్దర్ అన్నారు. అశోక్‌నగర్‌లో బాలలతకు మద్దతుగా ఆమె మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి పాటు పడాల్సిన ఐఏఎస్ అధికారిణి ప్రజల మనోభావాలను దెబ్బ తీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ వాఖ్యలను అలుసుగా తీసుకొని భవిష్యత్తులో పిల్లలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీలను చులకన చేసి మాట్లాడే ప్రమాదముందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగులపై చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. జన చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుంటి నగేశ్, మమతారెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు వృద్ధురాలి మృతదేహం

దహనం కంటే.. విద్యార్థులకు ఇవ్వడమే.. ప్రయోజనం

ప్రగతినగర్ వాసి దుబ్బాక వజ్రమ్మ దేహం దానం

మృతురాలు దుబ్బాక వజ్రమ్మ (ఫైల్)

దుండిగల్, జూలై 27: మృతదేహాన్ని దహనం చేయడం, పూడ్చి పెట్టడం కన్నా ఏదేని ఒక వైద్య కళాశాలకు ఇవ్వడమే ఉత్తమమని తలచి బాధిత కుటుంబ సభ్యులు ఒక వినూత్న కార్యక్రమానికి పూనుకున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌కు చెందిన గ్రామ మాజీ సర్పంచ్, ప్రగతి సెంట్రల్ స్కూల్ కరెస్పాండెంట్ దుబ్బాక దయాకర్‌రెడ్డి తల్లి వజ్రమ్మ(88)శుక్రవారం రాత్రి మృతి చెందారు. కాగా, ఆమె కుమారుడు దయాకర్ రెడ్డితో పాటు కుమార్తె కుకునూరు సరళ ఇతర కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం వజ్రమ్మ భౌతిక కాయాన్ని స్వచ్ఛందంగా బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్(మామ్స్)కు దానం చేశారు. మరణించిన తర్వాత దేహాన్ని కాల్చి, పూడ్చడం కంటే మెడికల్ కాలేజీలకు ఇవ్వడం వల్ల ఎంతో మంది వైద్య విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చితే సమాజానికి ఉపయోగపడుతుందని మమతా కాలేజీ డీన్ హరికృష్ణ తెలిపారు. మామ్స్ వైస్ ప్రిన్సిపాల్ బి.నవీన్ కుమార్, అనాటమీ డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ మృతరాలి కుటుంబ సభ్యులను అభినందించారు. అంతకు ముందు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి తదితర ప్రముఖులు ప్రగతినగర్‌లోని దయాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి వజ్రమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. దయాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.

వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన తెలంగాణ హ్యాండ్లూమ్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్

సిల్క్ వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఆదివారం ఏర్పాటు చేసిన సిల్క్ వస్త్ర ప్రదర్శనను తెలంగాణ హ్యాండ్లూమ్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ప్రారంభించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలకు ఖచ్చితమైన గ్యారెంటీ ఉంటుందని, చేనేతకారులను ప్రోత్సహిస్తూ వారికి ఓ వేదికను ఇస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్ కృషి అభినందనీయమని ఆమె అన్నారు. సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆగస్టు ఐదో తేదీ వరకు అందుబాటులో ఉంటుందని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమార్ తెలిపారు.

– వెంగళరావునగర్, జూలై 27;

తెలంగాణ ఆణిముత్యం డాక్టర్ సినారె

సినారె సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి యాకూబ్‌కు ప్రదానం చేసి సత్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జూలై 27: తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రతి ఏటా ప్రదానం చేస్తున్న డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి డాక్టర్ యాకూబ్‌కు సినారె 93వ జయంతిని పురస్కరించుని ఆబిడ్స్ తిలక్ రోడ్డులో గల పరిషత్తు హాలులో శనివారం ప్రదానం చేశారు. ఈ పురస్కారం కింద రూ.25 వేల నగదు, జ్ఞాపిక ఇచ్చి శాలువాతో సత్కరించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి హాజరై ప్రసంగించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి పాల్గొన్నారు.

భవ్య భారతంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద

సదస్సులో మాట్లాడుతున్న స్వామి బోధమయానంద

చిక్కడపల్లి, జూలై 27: భవ్య భారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. రామకృష్ణ మఠంలో విద్యపై నిర్వహించిన జాతీయ సదస్సులో శనివారం ఆయన ప్రసంగించారు. ఆధునిక సవాళ్లకు, సనాతన పరిష్కారాలను చూపేందుకు స్వామి వివేకానంద బోధనలు తోడ్పడతాయన్నారు. హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ, విద్యార్థులకు నచ్చిన కోర్స్ ఎంపిక చేసుకునే స్వచ్ఛ ఉండాలన్నారు. 18 ఏండ్లకే ప్రధానిని ఎన్నుకునే హక్కు వస్తుందని, నచ్చిన కోర్సును ఎంపిక చేసుకునే హక్కు మాత్రం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత భారతాన్ని సాధించాలంటే విద్యా సంస్థలు పరిశ్రమలతో కలిసి పని చేయాలని ఆయన సూచించారు. సదస్సులో వివిధ విద్యా సంస్థలకు చెందిన వెయ్యి మందికి పైగా ప్రతినిధులు విద్యావేత్తలు పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా సైబర్ సెక్యూరిటీదే..

సైబర్ సెక్యూరిటీ సీఈఓ శ్రీరామ్ బిరదవోలు

జూబ్లీహిల్స్, జూలై 27: సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, భవిష్యత్ అంతా సైబర్ సెక్యూరిటీదేనని సైబర్ సెక్యూరిటీ సీఈఓ శ్రీరామ్ బిరదవోలు అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ సెక్యూరిటీకి మంచి డిమాండ్ ఉన్నందున విద్యార్థులు బీ టెక్‌తో పాటు సైబర్ సెక్యూరిటీ వైపు మొగ్గు చూపాలని సూచించారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగపు పాజెక్ట్ ఎగ్జిబిషన్‌తో పాటు వార్షికోత్సవ కార్యక్రమాలను ఆయన శనివారం ప్రారంభించారు. విద్యార్థులు విన్నూత్నంగా ఆలోచించడంతో పాటు సరికొత్త టెక్నాలజీలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపాలని, హ్యాకథాన్‌లు, వర్కషాపులలో విస్తృతంగా పాల్గొని కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావేద్, సీఈఓ విభాగపు హెచ్ఓడీ డాక్టర్ సయీద్ షబ్బీర్ అహ్మద్, ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్, రిజిస్ట్రార్ నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న సైబర్ సెక్యూరిటీ సీఈఓ శ్రీరామ్ బిరదవోలు, చిత్రంలో తదితరులు

పరిశ్రమలను తెరిపించి కార్మికులను ఆదుకోండి

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి

అభివాదం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడారు

చిక్కడపల్లి, జూలై 27: మూతపడిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు కావాల్సిన వస్త్రాలతో పాటు బతుకమ్మ చీరలు పథకాన్ని అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక(జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్క్ వద్ద నేతన్నల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడారు. ఏడు నెలలుగా సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ పూర్తిగా మూతపడిందని, దీనితో కార్మికులు, వస్త్ర పరిశ్రమ మీద ఆధారపడిన వారందరు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేని పది మంది నేతన్నలు ఆత్మహత్యలకు పాలవ్వడ్డారని వివరించారు. ఉన్న ఫలంగా బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేయడం పవర్‌లూమ్‌కి అవసరమైన విద్యుత్ సబ్సిడీని ఎత్తివేయడం వల్ల పవర్‌లూమ్ మగ్గాలు మూగబోయాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించి కార్మికలు ఉపాధి కల్పించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, వేదిక నాయకులు కూరపాటి రమేశ్, సీపీఎం పార్టీ నాయకులు టి.స్కైలాబ్ బాబు, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, ఆడెపు భాస్కర్, రవి, దామోదర్, శాంతి కుమార్, మురళీధర్, సిరిసిల్ల రవి, సత్యం పాల్గొన్నారు.